# పెద్దమనిషి

[కథానిక]

= శ్రీ అనిశెట్టి సుబ్బారావు =

౧

పెండ్లి అయిం దతనికి. చదువు పూర్తిచేసుకుని ఉద్యోగంలో ప్రవేశించాడు. బ్రతికిన నాలుగునాళ్లూ మంచివా డనిపించుకుని పోయాడు తండ్రి. తన కంట్రాక్టుపనీ, తానూ తప్ప మరో జాగ్రత ఎరగడు. తండ్రిపోలికలే హనుమంతరావులోనూ. తెల్లని చొక్కాపైని కోటూ, మాయని ధోవతీ, బూటూ వేసుకుని ఖచితంగా పదకొండు కొట్టేసరికే తాలూకా కచేరీలో హాజరౌతాడు. త్రోవలో, వచ్చేపోయే ప్రజను పట్టించుకోడు. ఆరోద చెవి కెక్కిపోతుందేమో నన్న భయంతోనో ఏమో, వీథిమలుపు ఇట్టే చూస్తుం డగనే తిరిగేవాడు. చూపు ఎప్పుడూ పరధ్యానంగా కాకపోయినా లోపలికే చొచ్చుకుపోయేది. అతని మనస్సు ఖాళీగా వుంటుందో, ఖంగారుగా వుంటుందో తేల్చుకోనివ్వదు ఏపరిశీలనకూడా. గడప దాటి, ఖంగున తలుపు లాగేసి మెట్లు దిగి వెళ్లిపోయేవాడు. మళ్లీ రెండుగంటలకే ఇంటికి తిరిగివచ్చేది.

వేసవి సమీపించే రోజుల్లో, పను లేవీ లేక ఇండ్లలో వున్న కాపులూ, రైతులూ తీరిగ్గా మెతుకులు నోట వేసుకుని, విశ్రాంతిగా, చుట్ట పీలుస్తూ బయటికి వచ్చేవారు. బ్రాహ్మణులు ఇద్దరో ముగ్గురో వుంటే వారూ, అత్తవారి ఆస్తి వచ్చిపడటంచేత చీకూ చింతా లేని నాగిశెట్టీ ఆకబురూ ఈకబురూ చెప్పుకుంటూ, సరేనంటే సరేనని, సవాలంటే సవాలని తారాట కానీ పాడేవారు. పైన మబ్బువేసి ఎంత మాటుపడితేనే ఏదైనా. కాని, రేవు వున్న వూరికి ఇంతలో మబ్బు ఇంతలో చినుకులుగా ఆట వదలనిచ్చేదిగాదు. బాగా రోషాలు పెరిగా యని మాటల్లోనూ, ఆటల్లోనూ వ్యక్తమైతే, చెడుగుళ్లు మొదలుపెట్టి పార్టీలు పార్టీలు పెంచుకుని యెలదాటి రానిచ్చేవారే కాదు అవతలవాణ్ణి. ఆ ఇరుకుసందులో అటువెళ్లినా రహదారీ, బండ్లూ అన్నీనూ; ఇటూ అంతే. వ్యవసాయదారుల నివాసాల వద్ద ఏం త్రోవ వుంటుంది! ఏం అవసరమని! అందుకే వాళ్లపిల్లలుకూడా అక్కడే ఆడుకోవలసివచ్చేది. ఒకవేపు పెద్దలే ఆడుతూంటే పిల్లలా మరి ఊరుకునేది. వారూ దాగుడుమూతలనీ, చెడుగుళ్లనీ, బొంగరాలనీ—ఒకటేమిటి, ఎవరి మనసుకు ఏది కులాసాగా తోస్తే అది పొద్దుటినుంచీ సాయంత్రంవరకూ ఒకటి మార్చి మరొకటిగా ఆటలే ఆటలు!

హనుమంతరావు ఇల్లు చేరుకునేప్పటికే ప్రొద్దు నెత్తికెక్కింది సూటిగా. త్రోవలో పెద్దవాళ్లంతా 'పులి!' 'పులి!' అని కోలాహలంగా ఆడుతూ, చెడుగుడులో చనిపోయినవాళ్లు త్రోవలో మనిషినడిచే సందైనా ఇవ్వకుండా ఆడుతున్నవాళ్లను ఊసి గొల్పుతూంటే, ప్రక్కనే నుంచుని, ఎవరో ఒకరు చూచి గ్రహించి తొలగేవరకో, బ్రతికి తన పార్టీలో చేరేవరకో ఆగి అప్పుడుగాని వెళ్లేవాడు గాదు. దూరాన్నుండి, వెల్లకిల వేసిన మంచాలమీద చూరునీడల్లో పడుకునే ముసలయ్యలుగాని, గుడ్డలు కుట్టుకుంటూ తమ కొడుకులవేపే న్యాయం పలికే

ముసలమ్మలు గాని ఆటసందడిలో ఇతన్ని గుర్తించే వారే కాదు.

వాళ్లను దాటివచ్చి, వడివడిగా ఇంట్లో ప్రవేశించేముందు మెట్లమీద మట్టిముద్దలు పెట్టీ, గుడ్డలు పరిచీ ఆడుకుంటున్న ఆపిల్లలందరివేపూ గుడ్లురిమేవాడు. తన ఇంటిముందింత గోలగా, తెంచిన పూల మొక్కలూ, చెక్కబొమ్మలూ పట్టుకొని ఆడుకొంటూంటే చూచి అసహ్యపడేవాడు. వాళ్లు ఒకటికి పోసి తారాటకు పట్టీలు వేస్తోంటే చీదరించుకుని అనేవాడు:

"ఛో పొండి!...మీ అయ్య లాడుతున్నా తక్కడ్కచాలదూ...వెధవ మకిలమొహాలూ మీరూనూ.

"గోచీ పెట్టుకు రాలే వబ్బాయ్! ఇన్ని ఆటలు నేర్చావుగాని...

"ఈ బొంగర మేమిటి...ఈ పిచ్చిచేష్ట లెవరు నేర్పారు మీకు...

"ఒరేవ్! చెంబిక్కడ పెట్టి ఏమి టక్కడ నువ్వాడేది...మీ అమ్మతో చెప్పనా...

"ఫొండి...వెధవలు! ఇట్లా బజార్లో గోలచేస్తూ మమ్మల్నవస్థ పెట్టకపోతే ఇంట్లో పడుండరాదు..."

బుడ్డమూతి పెట్టుకుని ఒకరూ, పాలచెంబుమీద బొంగరం మొన గుచ్చుకుంటో తిరిగిచూస్తో ఒకరూ, కొంతమంది పరుగెత్తి జారుకునేవారు. ప్రతిరోజూ, భోజనం పూర్తిచేసివచ్చి, అద్దాల కిటికీ తెరిచి 'కాపీ' చెయ్యవలసిన పేర్లు లెఖ్ఖపెట్టుకుంటూ కసురుతూ ఉండడం అతని కలవాటు.

"మళ్లీ క్రొత్తవాళ్లొస్తారు. కూడదీసి ఆటలు సాగిస్తాం...ఇంతలో ఈ పెద్దమనిషి వెళ్లిపోతాడు గదా" అని రోడ్డుకు ఏవేపునో నుంచునో, పెద్దవాళ్ల ఆట చూస్తూనో వేచివుండేవారు ఇద్దరో ముగ్గురో. చేతికర్ర ఊపుతూ, కోటుగుండీలు సవరించుకుంటూ మళ్లీ కచేరీకి వెళ్లిపోగానే ఎక్కణ్ణుంచి వచ్చేవారో పుట్ట పగిలినట్టు. గల్లంతు గల్లంతుగా ఆడుతూ, కేరింతలు కొడుతూ ఎగిరేవారు.

అంత కోలాహలమూ చూపిస్తూ, పిల్లవానికి గోరుముద్దలు తినిపిస్తూ కమలమ్మ వాకిట్లో నుంచునేది. నారింజపండు వొల్చి, తొన మిగలకుండా అందరికీ పంచిపెట్టేది. తొనలు మింగుతూ 'దాయి!' 'దాయి!' అంటో పిల్లలింకా ఆడుతూనే వుండేవారు. "కమలమ్మగా రెంత మంచివారు! వాడే మరీనూ..." అనుకునేవారు పిల్లల్లో పిల్లల్లో. అతనేమూలనుంచి వస్తాడో నని బెదురుచూపులు చూసినా ఆమెకు పూర్తిగా మాలిమిపడ్డారు వాళ్లు. ఒకరో యిద్దరో పిల్లలు ఆమెరాకకోసం ఆ అద్దాల కిటికీలోనుంచి తొంగిచూస్తుండేవారు నాలుక లూరించుకుంటూ.

ప్రతిరోజూ వీళ్లకు అవస్థగా వుంది అతని ప్రవర్తన. అతనికీ అంతే ఎంతకూ వినిపించుకోక, లెక్క చెయ్యక ఆటల్లోమునిగి పిల్ల లెవ్వరూ కదలని నాడు భార్యను పిలిచి విసుక్కునేవాడు. నానా మాటలూ అనేవాడు. లిస్టుల పుస్తకాలు ఫెళ్లున విసిరేవాడు. తన నిశ్శబ్దతకూ, గౌరవానికీ అంతరాయం కలుగుతున్న దని ఎగిరిపడేవాడు.

"నీకు బుద్ధిలేదటే! నువ్వు చెప్పలేవూ వాళ్లను వెళ్లిపొమ్మని...నా కింకా ముప్ఫయ్యేళ్లు దాటలేదు. యిప్పుడే మితిమీరిపోయావు...

"తల్లు లున్నారుగా ... వాళ్లూ వస్తూనే వుంటారుగా పచ్చడికనీ, బండలకనీ... అంతమాత్రం తెలియదూ వాళ్లకు...

"ఇంతకూ నీకు మతి పోయినట్టుంది...అందరూ ఎవరిపని వారు తెమల్చుకుంటారుగాని నాకే వచ్చిపడ్డ దీచెర...

"వెధవ లిస్టులు...నువ్వు రాసిపెడతావా, నీ మొగుడు రాసిస్తాడా! కదలవేం! మొద్దు!!

"పిల్లవాణ్ణి సముదాయించగలవు...పాలివ్వగలవు... కూరగాయలవాడితో పోట్లాడగలవు నా తల పగిలేట్టు... యీ వెధవకొయ్యలతో చెప్పలేవూ... తండ్రు లక్కడా, వీళ్లు మనింటిముందూ...

"ఛో! తరుము వీళ్లను..."

రోజూ అతని ధోరణి అంతే. భర్తచీవాట్లు పడలేకా, పిల్లల్ని మందలించలేకా ఆమె నలిగిపోయేది మధ్య. ఆపిల్లలు క్రమేణా అక్క డాడుకోడం తగ్గించారుకూడ.

౨

కమలమ్మ కొడుకు కొన్నికొన్ని మాటలు పలుకుతున్నాడు. పరుగెత్తగలడు. నాన్నకు గ్లాసుతో మంచినీ ళ్లందివ్వగలడు. ఉయ్యాల తనే దిగగలడు; తనే ఎక్కగలడు కూడ. అతనికొరకని వాళ్ల అమ్మమ్మని పిలిపించారు. ఆమె ఎన్నోరోజులు లేదిక్కడ. మాగాణి తాలూకు కౌలువ్యవహారం సాకుచెప్పి శెలవు పుచ్చుకున్నది.

హనుమంతరావు కచేరీకి వెళ్లి వస్తూండేవాడు' తప్పకొని తప్పకొని వచ్చీరానట్టుగా యిల్లు చేరుకునేవాడు. ఎన్నాళ్లు చూస్తున్నా, ఎదిగి వస్తున్నా వాళ్లు ఆటలు మాననేలేదు. పిల్లలుమాత్రం పెద్దవారౌతున్నారు. రావడం మానేశారు పూర్తిగా. ఆ యింటిముందు గిరులు గీయడం, పూలమొక్కలు నాటడం ఏమీ లేవు. ఒక్క పిల్లవాడూ అటువేపు తొంగిచూడడు. అతను ఎప్పటికివలెనే అద్దాల కిటికీ తెరిచి వ్రాసుకొంటూండేవాడు. బూటు చప్పుడు కానీకుండా, చేతికర్ర రహస్యంగా ఊపుకొంటూ కచేరీకి వెళ్లిపోయినప్పు డతని కొడుకు బిక్కమొహంతో వీథివేపు పరికించి చూస్తుండేవాడు రోజూనూ. నారింజపండు చూసైనా, మూడుచక్రాల సైకిలు మెట్లమీదినుంచి జారిపడిపోతూంటేనైనా ఎవ్వరూ కన్నెత్తిచూసేవారే గాదు. ఈ నాలుగు సంవత్సరాల్లో ఆ అభిలాషా, అలవాట్లూ దిగజారిపోయిన వాబజారుపిల్లల్లో.

కొన్నాళ్లు గడిచి, హనుమంతరావు కొడుకును మామగారింట్లో వుంచి హైస్కూల్లో చదివించాడు. ఆపైని కాలేజీలో, అటుతరువాత ఇంజనీరింగు. అతనికి పెం డ్లయింది. ఉద్యోగంమీద వెళ్లిపోయాడు.

3

ఎప్పటిలాగే హనుమంతరావు కచేరీకి వెడుతూ తిరిగి వస్తూండేవాడు. చేతికర్ర పట్టుకురావడం లేదిప్పుడు. కోటుకు మునుపున్నంత నీటూ గోటూ అంటిపెట్టుకొని లేవు. పూర్వంవలెనే వీథిమలుపు తిరిగి వెళ్లేవాడు. మళ్లీ తిరిగివచ్చేసరికే ఆబజారుపెద్దలంతా తీవ్రంగా ఆట సాగిస్తుండేవారు. ఆటలో చచ్చినవారు ఉసిగొల్పుతూ లోపల ఆడేవారితో రెయిలబైట అటూ ఇటూ పరుగెత్తుతూండేవారు. తారాటలైతే చేతులు సాచి ఏ పరాయివాడి గుడ్డ తగిలినా ఆట కలిసివచ్చిం దనుకుని సగం గెల్చినట్టే కేకలు వేసేవారు. ముసలయ్యలు ఆ చూరుక్రింద నీడల్లోనే. ముసలమ్మలు పేలికలకు అతుకులు వేస్తూనే.

కాని, హనుమంతరావు పది అంగల దూరంలో ఉండగనే ఆటలో కూతపెట్టడం మానేసి, లేక చేతుల లంకెలు తెంపేసి సర్దుకునేవారు. వారు పూర్వం తన యింటిముం దాడుకున్న పిల్లలే నని అతనికి తెలుసు. కోటుజేబులో నారింజపండుమీద వ్రేళ్లు నిమురుతూ, తన అడుగులవంక తాను చూసుకుంటూ వెళ్లిపోయేవాడు. వాళ్లకేసి పరికించి చూసేవాడో లేదో!

“అందరూ తన కళ్లముందు పెరిగినవాళ్లే. అడుగో! వాడు చిన్నతనంలో గోసుకాడవలె తూలిపోయేవాడు, ఇప్పు డెంత దిట్టసరి అయినాడు!... వీడు! బొంగరా లెంత అందంగా గిరాటుపెట్టించేవాడు...తన యింటిముందు అప్పు డెంత సౌభాగ్యం ఉట్టిపడేది! పెద్దవాళ్లయినా రిప్పుడు...కాపురాలు నడుపుకున్నారు...నన్ను చూసి ఆట మానేస్తారేం?”

ఈభావా లన్నీ రూపం పొందేటప్పటికే ఇంటిమె ట్లెక్కేవాడు. తలుపు ‘టక్...టక్’ మనిపించి మెల్లిగా అడుగుపెట్టేవాడు. అతను వెళ్లడాన్ని చిత్రంగా పరిశీలిస్తూ ముసలయ్యలు పెదవులు బిగించి చుట్టపొగ లోపలే కుక్కుకునేవారు. పట్టులో వున్న ఆటంతా భగ్నమైనట్టే. ఫర్వాలేదు. వెంటనే మొదలెట్టే ప్రయత్నాలు జరిగేవి.

హనుమంతరావు ఎప్పటికిమల్లే అద్దాలకిటికీ తెరిచి, చిఠాలో పేర్లు ఎక్కిస్తూండేవాడు. మధ్య మధ్య వ్రాయడం ఆపేసి దూరంగా ఎదురుగా కనిపించే చెట్టునూ, వాడి రాలిపోతున్న దాని ఆకుల్నీ చూస్తూ, గాలి పీల్చుకుంటూ, భారంగా వదులుతూ మళ్ళీ కలం పేజీమీద కదిపేవాడు. ఒక్కొక్కసారి భార్యను పిలిచి "ఆ నారింజపండు...అలా బల్లమీద వుంచకపోతే ఎవరికేనా పెట్టరాదూ వొల్చి" అనే వాడు. ఎవరున్నారని! ఆమె అటూ ఇటూ చూసి ఎవరూ మెసలకపోవటం గమనించి వంటగదిలోకి వెళ్లిపోయేది.

"మనవాడుంటే ఎంత బావుండేదే ఇక్కడ! వాడితోటివాళ్లు అక్కడెంతమం దాడుతున్నా రను కున్నావ్! ఓ! పెద్ద తిరుణాళ్లలా గున్నది. కాని... ఐనా, వాడూ పెద్దవాడైనాడా — ఆ నాలుగు డబ్బులూ పంపుతున్నందుకు సంతోషించాలి మన మూ..." అని పుస్తకాలూ, ఫైలూ ప్రక్కకు నెట్టేసి ఆమెను వంటగదిలోకి వెంబడించేవాడు.

"సరే లెండి! ఉత్తరం రాస్తే అబ్బా యొక పదిరోజులు శెలవుపెట్టి వస్తాడుగా...ఇంకో నెలలో మీ రెల్లాగో పింఛను పుచ్చుకోబోతున్నారాయను... స్వంతఇల్లు కట్టుకున్నందుకు గానీ లేకుంటే మనమూ అక్కడికే వెళ్లివుందుము."

"నే నింట్లో కూచుంటే వాడి ఖర్చులకూ వాటికీ పోతే ఎల్లా మిగులుతాయి...ఆ! వాడూ పెద్ద వాడైనాడా! మనకూ ఇంకా ఏపసిపిల్లో కలిగితే ఎంత ముద్దుగా వుంటుందీ!" అనేవాడు.

ఆమె చిరునవ్వు నవ్వేది.

"ఎందుకు కలగగూడదు!" అని గద్దించేవాడు.

ఆమెఒత్తిడిమీద అబ్బాయికి జాబువ్రాస్తే తీరిక వుండదనీ, శెలవు దొరకదనీ వ్రాసి, వచ్చి నాలుగు రోజులుమాత్రం వుండి వెళ్లాడు. హనుమంతరా వతన్ని వదలలేక లోలోపల కుమిలిపోయాడు.

రిటైరైనతర్వాత, బజారుకు అవసరంగా వెళ్ల వలసివచ్చినా పూనుకునేవాడు గాదు. అద్దాలకిటికీ తెరిచి ప్రొద్దుటి లేతఎండ చూస్తూ, ఏదో యోచించు కొంటూ, ఏమీ తోచనప్పుడు భార్యను పిలుస్తుండే వాడు. "బంగాళాదుంపలు వేయించుకుంటున్నాను"— "వేపుడు వేస్తున్నాను"—"అబ్బ! తొందర!!" అని జవాబులు వస్తూండేవి.

అత నవి పట్టించుకునేవాడే కాదు. అతని ధోర ణిలో అతను.

"పిలిచి ఆ వెంకయ్యకు చెప్పు, ఒకసారి మా ట్లాడి పొమ్మన్నానని...సరేకాని, ఆపిల్ల లెవరూ ఇప్పుడాడుకోడానికి రావడం లేదే...పూర్వం పూల మొక్కలూ అవీ పెట్టి తోటకాపరు లనీ, యజమాను లనీ ఆడేవారు!...నే నాకిటికీలోనుంచి చూస్తూనే వుండేవాణ్ణిగా! ఆవెంకయ్య ఆనక వచ్చినపుడు వాళ్ల పిల్లల్నీ వాళ్లనీ పంపమని చెప్పు...మన ఇంటిముందే ఆడుకుంటారు. ఏం మునిగిపోయిందేమిటీ ఇంతలో... నాకూ ఏమీ తోచడంలేదా..."

"చెప్తాను...జుట్టు తెల్లబడిం దని ఎవరేనా దువ్వుకోకుండా వుంటారా ఏమిటండీ...—"

"నేను చెప్పింది వినిపిస్తుందా! మొన్న వాళ్లూ అంతే...ఆటలాడుతూంటే, ఆగి, చూదా మనుకు న్నాను. చిన్నతనంలో నేనుమాత్రం వెళ్లగొట్టానా ఊరి కేనే...చప్పున ఆట ఆపేసి వెళ్లిపోయారు ప్రక్క ప్రక్కలకు...అసలు గమనించనట్లే వచ్చేశాను నా దారిన...బాగుంది! చూడు! చెప్తూంటే వినవేం? అత నొస్తా డానిక...చెప్పు పంపమని...నాకు దిగు లుగా వుంది!..."

అతని కిప్పుడు సంపూర్ణమైన విశ్రాంతి. కిటికీ ముందు కూచుని చూస్తూండేవాడు "ఎవరేనా వస్తా రా?" అని, ఆడుకునేందుకు.

ఒకనాడు పుస్తకాలూ, దస్తరాలూ పట్టుకుని ఎగురుతూ వెళ్లిపోతున్నారు పిల్లలు బడి వదిలేవేళకు. అతను కిటికీలోనుంచి చూస్తున్నాడు. గంతులు వేస్తూ వచ్చిన పిల్లలు అతన్ని చూసి మెల్లిగా దాటి వెళ్లి పోయారు. వాళ్లవేపు చూశాడు. చిరునవ్వు నవ్వాడు. వేళ్లు కదిలించాడు రమ్మని. వాళ్లు పరుగులు పెడుతూ దృష్టిదాటారు.

అతను భార్యతో అన్నాడు: "ఏమే! అతనితో చెప్పావా నేనన్నది?"

"చెప్పాను"

"మరి రారేం ఎవరూ?—పూర్వం ఎంత చక్కగా ఆడుకునేవారో... పెండ్లిళ్ళులా నుండేది గదూ!"

"అతను పంపుతానన్నాడు...చెప్పాట్ట...వాళ్లే రావడం లేదు...అతనితో అన్నాను—'మావారి విషయం మీరు గ్రహించలేదూ, ఏదో ఒంటరిగా వున్నారని...అంతేనూ' అని...అతనన్నాడూ - 'అవునమ్మా మాకుమాత్రం తెలియదా? చిన్నవాడు మేంమాత్రం ఇక్కడాడుకోలేదా' అని. 'అలా కాదు వెంకయ్యా! మావారు చాలా మారిపోయారు ... ఆయన కేమీ తోచటం లేదట—మిత్రులా అంటే ఎవరి పనిమీద వారుంటారు. నువ్వు తప్పక చెప్పు మీ అబ్బాయిలతో' అని"

హనుమంతరావు ఉగ్రుడైనాడు.

"బాగుంది! ఏం? నే నేం చేశానని, నే నేం మారానని ... బాగుంది! వెధవజాత రైపోయింది మీతో!!"

"అదేమిటి...నేనుమాత్రం ఏమన్నానూ...ఆ చెత్తలో రొంపిలో పొర్లాడేకంటే మీ అబ్బాయిల్ని ఈ గచ్చుమీదే ఆడుకోమనరాదా అని"

హనుమంతరావు మెల్లగా వెళ్లి కుర్చీలో తల పట్టుకుని కూచున్నాడు.

బజారున ఎవరైనా వెడుతూంటే ప్రతిరోజూ ప్రశ్నించేవాడు:

"ఏమయ్యా! అటు ఎవరేనా పిల్లలు గన్నేరు మండలు పట్టుకొని వస్తున్నారా?...

"ఎవరేనా ఆచివర 'పులి! పులి!' అంటున్నారా?...అంటే పెద్దవాళ్లు కాదు ... చిన్నపిల్లలు ... సంతోషంగా, కులాసాగా ఆడుకుంటూంటారే; వారు.

"ఆ మూల పిల్లలు దాగుడుమూత లాడటం లేదూ? ఇక్కడాడుకోవచ్చు...రమ్మని చెపుతావ్?"

ఆతురతతో ముందుకు చూచేవాడు, ఆ వాడిపోయిన చెట్టువంక.

అటుగా రోజూ పిల్లలు వెడుతూనేవుండేవారు. చూడకుండా, పలుక్కుండా, వినిపించుకోకుండా.

ఒకనాడు భోజనంవద్ద భార్యను అడిగాడు:

"ఆ వెంకయ్య తగలబడ్డట్టే...వాడాడుతూంటే ఎన్నోమార్లు చూశాను...చెప్పమంటే ఏమి టతను? నీకు మతి వుంటేగా...ఇన్నాళ్లనుంచీ చెప్తున్నాను...యాభైయేళ్లు పైబడినవాణ్నిగదా అని కొంచెమైనా గౌరవం వుంచావా ... ఇటు చూడు! బిక్కమొహం వేసి ఏమిటది! మాట అంటే మూతి బిగించుకుని ఏమిటది! ... ఎవరి పని వారు తెమల్చుకుంటారుగాని, నాకే వచ్చిపడ్డ దీచెర!"

లేచి, చెంగుచెంగున వాకిలిదగ్గరికి వచ్చాడు దూరాన్నుండి "పులి! పులి!" అని ఆటగాళ్ల అరుపులూ, కేకలూ వినిపిస్తున్నవి. పెద్దవాళ్లు వీథిచివర ఎప్పటిలాగా ఆడుతున్నారు. హనుమంతరావు కండువా భుజాన వేసుకున్నాడు. అద్దం చూచి తల సవరించుకుని, తిరిగిచూచి కండువా తీసి కొంకికుతగిలించి కుర్చీలో చతికిలపడ్డాడు.

రంగయ్యకొడుకు అటువేపే వెడుతున్నాడు గొంతులో రాగం మోగించుకుంటూ.

"ఒరేయ్! అబ్బాయ్!...మాటమ్మా, మాట—" చిరునవ్వు నవ్వాడు.

"మాతండ్రీ! ఎక్కడికెడుతున్నావ్—"

పిల్లవాడు బుడ్డమూతి పెట్టుకున్నాడు.

"ఏం అలావున్నావ్! మాఇంటికి రారాదూ?.. ఆడుకుందువుగాని ... నీతో అబ్బాయిలు లేరూ... వాళ్లని పిలుచుకురా—"

అతను కిటికీబైటనుండి చేయి వదిలించుకో చూస్తున్నాడు వెళ్లిపోవాలని.

"ఇదిగో తొన, తీసుకో...తినమ్మా!—

"రోజూ మాఇంటికి ర్యా ఆడుకుందువుగాని... వాళ్లెందుకు రారు?—"

పిల్లవాడు కొంచెం భయం తగ్గి—

"వాళ్లెందుకొస్తారు!" అన్నాడు.

"ఏం? ఎందుకనీ...నీకు తొనలివ్వడం లేదూ... అలాగే వాళ్లకూ పంచిపెడతానుగా"

"మా చిన్నాయన వెంకయ్య చెప్పాడుగా..."

"ఆ—అదే—మరెందుకు రాలేదు?"

"వస్తే వెళ్లగొడతావట ... ఘోషామ్మంటావట...మా నాయనగూడా చెప్పాడు"

"అదేమిటే! అది కాదు నే చెప్పింది" లోపలి వైపు తలతిప్పాడు. "ఏమేవ్!...ఇవికూడా నేర్చుకున్నావా...పంపొద్దని చెప్పావా వెంకయ్యతో"—పెద్దగా వంటగదిలోనికి అరిచాడు.

"మేమేం ... పిల్లల మందరమూ నే ... అనుకున్నాంగా మీఇంటికి రావద్దని...మా నాయన్ని చిన్నప్పుడు గదమాయించావట ... సత్తిగాడు చెప్పాడు"

పిల్లవాడే బల్లమీది ఇంకోతొన కిటికీలోనుంచి అందుకుని నములుతున్నాడు.

"అయ్యో తండ్రీ! నేనే మెరుగుదును...నేనెందుకు కొడతాను!"

"మేం పెదరస్తాదగ్గర ఆడుకుంటున్నాంగా... నువ్వుకూడా వస్తావా!"

పిల్లవాడు తొన లందుకుని జేబులో కుక్కుకుంటున్నాడు.

"సరే వొస్తున్నా!"

హనుమంతరావు ఛటాలున లేచి గడప దిగి వెళ్లిపోతూ లోపలికి అరిచాడు:

"తలుపు వేసుకో! ఇప్పుడు రాను"

---

# వీర పూజ

శ్రీ కొత్త సత్యనారాయణచౌదరి

రామకృష్ణాది వీరవిక్రమచరిత్ర
భవ్యకవితాస్రవంతిలోఁ బాదుకొలిపి
శాశ్వతానందరసమును జాలువఱుచు
కవులె వీరుల పూజకుఁ గడఁగు టొప్పు.

కౌరవుల గాథ లేనాఁడు కలిగె వాని
నెందఱెందఱొ స్మరియించుచుందు రేల!
రాముఁ డేనాఁటివాఁడొ! యారాచబిడ్డ
పడ్డ వెత లెట్టివో స్మరింపంగనేల!

మాతృదేశంబుకోసమై మానసీయ
జీవితం బంత నర్పణచేసి పెక్కు-
లిడుమలనుమాత్రమే తాను గుడిచి యిచ్చుఁ
బరుల కెన్నియొ మేళ్లు సత్పురుషుఁ డెందు.

తనదు జాతీయవీరుల తత్త్వ మన్వ
హంబు మననంబుగావించునట్టి దేశ
మగును భాగ్యంపు రాశిగ, నట్టి దశకు
వచ్చు జాతియె జాతి యెవ్వారికైన.

వీరపూజ యెఱుంగనివారి జాతి
నిత్య ముత్సాహమును దక్కి నీరసించు,
ప్రజల జవసత్త్వములకును భాగ్యభోగ్య
ములకు ముఖ్యము వీరపూజలు తలంప.

---